క్లుప్తంగా

నేడు గోశాల కమిటీ ఏర్పాటు

పెడన: పెడన హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఈ నెల 5వ తేదీ సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పెదముత్తేవి కృష్ణాశ్రమం ముముక్షుజన మహాపీఠాధిపతులు గౌరకృష్ణ గురుదేవులతో గోశాల కమిటీని ఏర్పాటు చేస్తారని ఐక్యవేదిక ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీగంగా పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు జరిగే సమావేశానికి పెడన పట్టణంలోని దేవాలయాల కమిటీల సభ్యులు, అర్చకులు, అన్ని హిందూ సంఘాలు, హిందూ బంధువులు పాల్గొని గోశాల కమిటీకి సహాయ సహకారాలను అందించాలని కోరారు.

మండలి వెంకట కృష్ణారావు జయంతి

శ్రీకాకుళం(ఘంటసాల): దివిసీమ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు అని ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. శ్రీకాకుళం సెంటర్‌లో మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళం పంచాయతీ పరిధిలోని సూరపనేనిపాలెంకు చెందిన రాచూరి గురుప్రసాద్ కుమార్తె గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. హాస్టల్ ఫీజు నిమిత్తం వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా ఎంపీటీసీ తాడికొండ చిన్న, జనసైనికుల ఆధ్వర్యంలో రూ.10వేల నగదును గురుప్రసాద్‌కు అందించారు.

సాగునీరు లేక రైతుల కన్నీరు



ఘంటసాల: సాగునీరు లేక రైతుల కంట కన్నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఘంటసాలకు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘంటసాల గ్రామం పరిధిలోని 3/2 చానల్ కింద రైతులు సాగునీరు లేక వ్యవసాయ పనులు చేసుకోలేని దుస్థితి నెలకొందని పలువురు రైతులు ఆదివారం వాపోయారు. కాలువ కింద సుమారు 4 వేల ఎకరాల్లో సాగవుతుండగా జూలై 16న కురిసిన భారీ వర్షాలకు, మోటర్ల సాయంతో నాట్లు వేసిన పొలాలు నెర్రెలిచ్చి ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికీ 1,500 ఎకరాల్లో నాట్లు వేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. 3/2 చానల్ కింద ఘంటసాలపాలెం వద్ద రైతులు ఇష్టమొచ్చినట్లు గండ్లు వేసి నీరు దిగువకు రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ ఏఈ, డీఈల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోతున్నారు. నాట్లు వేసే సమయం అదనుతప్పితే కౌలు రైతులు, రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, మరికొందరు సాగునీటితో వ్యాపారం చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఘంటసాల 3/2చానల్‌కు సక్రమంగా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడి పొలాలను రైతులు చూపించారు. కార్యక్రమంలో కౌలురైతులు వేమూరి శివరామకృష్ణయ్య, ఉప్పల వెంకన్న, వేమూరి రత్నశేఖర్, యార్ల శ్రీకాంత్, మండవ రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మచిలీపట్నంటౌన్: ఇటీవల మృతి చెందిన బెరాకా మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ సత్యనారాయణ కుటుంబ సభ్యులను బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆదివారం పరామర్శించారు. సత్యనారాయణ భార్య భారతి, కుమారుడు బీఎస్ కిరణ్‌పాల్‌ను కలిసి ఓదార్చారు. పరామర్శించిన వారిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కొట్టే వెంకట్రావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు వంపుగడవల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని డాక్టర్ టీఎల్ పెరుమాళ్లు ఆస్పత్రి ప్రాంగణంలో పెద అవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, ఎముకలు, నరాలకు సంబంధించిన వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 100 మందికి పైగా రోగులకు సేవలందించినట్లు క్యాంప్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు రాజశేఖర్, సెక్రటరీ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- బందరు, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తికాని సర్దుబాటు ప్రక్రియ
- బందరులో 130, అవనిగడ్డలో 19 ఖాళీలు
- అవనిగడ్డలో 27 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- పూర్తిస్థాయిలో అందని బూట్లు
- కోడూరు పాఠశాల స్టోర్‌రూం లేక తరగతి గదిలోనే బియ్యం బస్తాలు



కోడూరు జెడ్పీ హైస్కూల్‌లో స్టోర్ రూం లేకపోవడంతో తరగతి గదిలో ఉంచిన మధ్యాహ్న భోజన పథకం బియ్యం బస్తాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ముఖ్యమైన పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఉంది. మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు బోధన కరువవ్వడమే కాకుండా ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. దీంతో సిలబస్ సకాలంలో పూర్తి కావడం లేదు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ఉపాధ్యాయులను నియమించాలనే సదుద్దేశంతో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసే దిశగా అడుగులు వేసింది. అయితే ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆ ప్రయత్నంపై నీళ్లు చల్లింది. ఉపాధ్యాయులు పోస్టుల భర్తీ ఆలస్యమవుతోంది.

వేగంగా పడని అడుగులు

డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కొత్త ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నా ఆ దిశగా అడుగులు వేగంగా పడటం లేదు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ఎప్పటికి పూర్తవుతుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కాకపోతే విద్యార్థుల ఉత్తీర్ణత మరింత దిగజారే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

బందరులో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఇలా

నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలలో మొత్తం 130 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ప్రధానంగా 13 ప్రధానోపాధ్యాయుల పోస్టులు, తెలుగు పండిట్లు 4, హిందీ పండిట్లు 4, ఇంగ్లిష్ 20, లెక్కలు 11, భౌతికశాస్త్రం 11, జీవశాస్త్రం 16, సాంఘికశాస్త్రం 9, వ్యాయామ ఉపాధ్యాయులు 10, స్పెషల్ ఎడ్యుకేషన్ నాలుగు, ఇలా పలు విభాగాల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల బోధన ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం జగనన్న విద్యాకానుక పథకం ద్వారా పాఠశాలలు తెరిచేలోపే కానుక కిట్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. పాఠశాలల తెరిచిన అనంతరం కానుక కిట్లను పాఠశాలల విద్యార్థులకు అందజేశారు.

ఇంకా అందని బూట్లు

అయితే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంకా బూట్లు అందలేదు. మొత్తం 12,466 మందిలో ఇంకా 550 మందికి బూట్లు అందజేయాల్సి ఉంది. యూనిఫాం కుట్టు కూలీ డబ్బులు తల్లుల బ్యాంకు ఖాతాలో పడలేదు. మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన మెనూ ప్రకారమే అందిస్తున్నారు.

ఏకోపాధ్యాయులు సెలవు పెడితే పక్కవారితో సర్దుబాటు

పెడన: ఉపాధ్యాయులు సెలవు పెడితే పక్క పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు వెళ్లాల్సిన పరిస్థితి పెడన మండలంలో నెలకొంది. మండలంలో 14 ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా అక్కడ అవసరమైతే ఎంఈవోనే సర్దుబాటు చేస్తున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే ఇటీవల ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు సోషల్ స్కూలు అసిస్టెంట్లు, ఎస్ఎస్ స్కూలు అసిస్టెంట్ ఒకరు పదవీ విరమణ పొందారు. మండలంలో ఈ ఐదు పోస్టులు ఖాళీలున్నాయి. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్స్)లు విషయానికి వస్తే 138 మందికి 133 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో ఇన్‌చార్జులతోను, అధికంగా ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తు నడిపిస్తున్నారు. మండలంలో మధ్యాహ్నం భోజనాన్ని అటెండెన్స్ తగ్గట్టు విద్యార్థులు భోజనం చేయడం లేదు. ఎక్కువ మంది తింటున్నారని రికార్డులో చూపుతున్నారు. ఇటీవల మధ్యాహ్న భోజన అసిస్టెంట్ డైరెక్టర్ పలు పాఠశాలల పరిశీలనకు వచ్చిన సమయంలో ఈ విషయాలు బయటపడ్డాయి.

కృత్తివెన్నులో..

మండలంలో 72 పాఠశాలలో 3,657 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 248 టీచర్ పోస్టులకు 223 మంది టీచర్లు ఉన్నారు. ఇంకా 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చినపాండ్రాక పంచాయతీలో కేవీఆర్ నగర్‌లో ఇటీవల అక్కడ పాఠశాలలో టీచర్ ప్రమోషన్ రావడంతో బదిలీ కాగా డిప్యూటేషన్‌పై స్కూల్ నడుపుతున్నారు.

బంటుమిల్లిలో..

పోస్టులు విషయానికి వస్తే ఎస్జీటీ 92 మంజూరవ్వగా 11 ఖాళీలున్నాయి. స్కూలు అసిస్టెంటింట్లు 37కు 35 మంది విధులు నిర్వహిస్తుండగా రెండు ఖాళీలున్నాయి.

గూడూరులో..

మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 44 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 7 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండల పరిషత్ పాఠశాలలకు సంబంధించి ఏకోపాధ్యాయ పాఠశాలలైన నందన్‌కాలనీ, గంటలమ్మపాలెం, మద్దిపట్ల, కప్పలదొడ్డిపాలెం, ఆకులమన్నాడు మెయిన్, పిండివారిపాలెం పాలెం పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు పాఠశాలల్లో ఇటీవల అనారోగ్యంతో ఉపాధ్యాయులు మరణించడంతో పోస్టులు ఖాళీ అవ్వగా, ఆకులమన్నాడు, పిండివారిపాలెంలో పదోన్నతిపై వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే సమీప పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యాబోధన చేస్తున్నారు.

తరగతి గదిలోనే బియ్యం బస్తాలు

అవనిగడ్డ: దివిసీమలో ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి పడిపోతుంది. కొన్నిచోట్ల ఖాళీగా ఉన్న స్థానాల్లో వేరేవారిని సర్దుబాటు చేసినా పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు సుముఖంగా లేరు. ఇంకా కొంతమంది విద్యార్థులకు షూ పంపిణీ జరగలేదు. తరగతి గదుల్లోనే బియ్యం బస్తాలు ఉంచుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించగా.. స్కూళ్లపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య తీరుతో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 255 స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 27 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. మొత్తం 19 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో వివిధ హైస్కూల్స్‌లో 10 పలు సబ్జెక్టులకు సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది టీచర్లను సర్దుబాటు చేసి 'పది' విద్యార్థులకు సబ్జెక్టు బోధనలో ఇబ్బంది లేకుండా చూశారు. ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించినా టీచర్ల పోస్టుల భర్తీకి చర్యలు వేగంగా తీసుకోకపోవడంతో కొంతమంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలో చేరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన మెనూనే విద్యార్థులకు అందజేస్తున్నారు. విద్యార్థులకు అందాల్సిన బూట్లు ఇంకా కొన్నిచోట్ల రాలేదు. బూట్ల సైజుల సమస్యలతో వాటిని వెనక్కు పంపించగా ఇంతవరకు తిరిగి రాలేదు.

వెలుగు చూసిన పలు సమస్యలు

- కోడూరు జెడ్పీ హైస్కూల్‌లో స్టోర్ రూం లేకపోవడంతో మధ్యాహ్న భోజన పథకానికి వచ్చిన బియ్యం సంచులను వరండాలోని తరగతి గదిలో నిల్వ ఉంచారు.
- ఈ హైస్కూల్లో వంటగది లేకపోవడంతో ఆరుబయటే వంట చేస్తున్నారు.
- కోడూరు జెడ్పీ హైస్కూల్లో సైకిల్ స్టాండ్ లేకపోవడంతో ఆరుబయట ఎండలోనే సైకిళ్లను ఉంచుతున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మెరకనపల్లి(మోపిదేవి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ అన్నారు. మెరకనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుప్రియ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి బ్రాంచి, మెరకనపల్లి స్వచ్ఛకార్యకర్తల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్, సెంటిని హాస్పటల్ సహకారంతో గుండె, నేత్ర వైద్య పరీక్షలతో పాటు బీపీ, సుగర్ క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేయడంతో పాటు అవగాహన సదస్సు నిర్వహించడం శుభపరిణామమన్నారు. 95 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్ డాక్టర్ గోపీచంద్, సెంటినీ హాస్పటల్ డాక్టర్ కాగిత కృష్ణచంద్, భాను, చంద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ, కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. వీధి వెలుగులు



కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలంలో 216 జాతీయ రహదారిపై పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంది. దీంతో స్థానికులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వారి ఇబ్బందులు వివరిస్తూ 'సాక్షి' ఇటీవల 'హైవేపై అలుముకున్న అంధకారం' శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు విద్యుత్ దీపాల వెలుగులను పునరుద్ధరించారు.

పంచాయతీలపై 'ఎల్‌ఈడీ' భారం

- 2017–18లో కొనుగోలు చేసిన బిల్లులు తక్షణం చెల్లించాలని హుకుం
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు
- జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించాల్సిందే అంటున్న ఉన్నతాధికారులు



పెనుమల్లి గ్రామం

పెడన: పంచాయతీలపై ఎల్‌ఈడీ భారం పడింది. పంచాయతీలకు ఎల్‌ఈడీ వీధి దీపాలను 2017–18లో నాటి టీడీపీ ప్రభుత్వం సరఫరా చేసింది. వాటికి సంబంధించి పంచాయతీ నుంచి విడతల వారీగా చెల్లించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఎల్‌ఈడీ వీధి దీపాల బిల్లుల చెల్లింపులు పంచాయతీలు భరించలేవని నిలుపుదల చేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లు ఆ ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం తిరిగి టీడీపీ అధికారం చేపట్టడం, ఎల్‌ఈడీ వీధి దీపాల బిల్లులు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. అధికారం చేపట్టి నెల రోజులు కూడా కాకముందే ఎల్‌ఈడీ బిల్లులు తక్షణం చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ అయ్యాయి. నెల రోజులు క్రితం ఎల్‌ఈడీ వీధి దీపాలకు సంబంధించి ఈఈఎస్ఎల్(ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్స్) పేమెంట్ స్టేటస్‌పై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఆరా తీస్తున్నారు. ఆయా పంచాయతీల్లో ఎంత బకాయిలున్నాయి, ఇప్పటి వరకు ఎంత చెల్లించారంటూ లెక్కలు తీసి, బ్యాలెన్సును తక్షణం కట్టాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. వివరాలు, బిల్లులు చెల్లించని వారుంటే వారికి మెమోలు ఇస్తామని కూడా హెచ్చరిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు అటు పంచాయతీలలో నిధులు లేక ఇటు చెల్లింపులు చేయలేక తలలు పట్టుకుంటున్నారు.

పెడన మండలంలో రూ.22 లక్షలతో కొనుగోలు

పెడన మండలంలోని 24 పంచాయతీల్లో చోడవరం మినహా మిగిలిన 23 పంచాయతీలు 4,748 ఎల్‌ఈడీ వీధి దీపాలు కొనుగోలు చేశాయి. 24 వాట్స్ బల్బులు 4,231, 32 వాట్స్ 453, 75 వాట్స్ దీపాలు 74 కొనుగోలు చేశారు. పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించాలని పేర్కొనడంతో రూ.22,48,016తో 4,748 వీధిదీపాలు కొనుగోలు చేశారు. మొదట్లో మూడు పంచాయతీలు బల్లిపర్రు, కాకర్లమూడి, చేవేంద్ర రూ.1,56,648 చెల్లించారు. ఈ పంచాయతీలు ఇంకా బకాయిలుండటంతో పాటు అసలు చెల్లింపు చేయని పంచాయతీలు 20 ఉన్నాయి. ఈ 23 పంచాయతీల బకాయిలు రూ.20,91,368 చెల్లించాల్సి ఉంది. తాజాగా ఉత్తర్వులు అందుకున్న తర్వాత మండలంలోని కొన్ని పంచాయతీలు రూ.1.09 లక్షలు చెల్లింపులు చేశాయి. కొన్ని పంచాయతీల్లో బిల్లులు చెల్లించడానికి చెక్ పవర్ లేక కార్యదర్శులు మిన్నకుండిపోయారు. ఇప్పుడు కాకపోయినా చెక్ పవర్ రాగానే చెల్లించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలు.. కట్టాలని చెబుతున్నాం



విడతల వారీగా పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించాలని వీధి దీపాలు కొనుగోలు చేసినప్పటి నుంచి ఉంది. అయితే అప్పటి నుంచి చెల్లించకుండా ఉండిపోయారు. తాజాగా చెల్లించాలని పేర్కొంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదే విషయాన్ని మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశాం. తక్షణం కట్టించాలని కోరుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం.

–ఎం జయరామ్, ఈవోపీఆర్డీ, పెడన

కరుణించు గంగాభవానీ



శాకంబరీ అలంకారంలో కోడూరు గంగాభవాని



సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాభవానీ అమ్మవారి మూలమూర్తికి ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు తొలిపూజలు చేశారు. అనంతరం అమ్మవారిని 1,500 కేజీల కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. పోతురాజు స్వామి వారితో పాటు అమ్మవారికి వాహనమైన సింహానికి కూడా కూరగాయలతో అలంకరించారు. మెరకగౌడపాలెంకు చెందిన భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి, మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి, మురుగునీటి సమస్య పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి అన్నారు. నగరంలోని సుందరయ్యనగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న మురుగునీటి శుద్ధి పథకం, మాచవరంలోని రిజర్వాయర్ పనులను వారిద్దరూ ఆదివారం పరిశీలించారు. 'ఈడేపల్లి' మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి మరో ఐదు కోట్లు అదనంగా అవసరమవుతాయని వారు తెలిపారు. నగరంలోని రహదారులపై చిన్నపాటి వర్షానికే ముంపు ఏర్పడుతోందని దీన్ని అధిగమించడానికి ఇటీవల ఢిల్లీ నుంచి వచ్చిన బృందం పర్యవేక్షించిందన్నారు. ఆ బృందం సూచన మేరకు అవసరమైన ప్రతిపాదనలను తయారుచేసి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటును మంజూరు చేయించి పనులు యుద్ధప్రాతిపదికన జరిగేలా కృషి చేస్తామన్నారు. నగరంలో తాగునీటి సమస్యను అధిగమించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7 నుంచి ఆగమన మహోత్సవాలు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలుమంగ పద్మావతీ సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వార్షిక ఆగమన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. బుధవారం మూలవరులకు అష్టోత్తర శత కలశాభిషేకం, గురువారం లక్ష తులసీ పుష్పాలతో అర్చన, శుక్రవారం మూలవరులకు నవ కలశాభిషేకం, మధ్యాహ్నం సమష్టి కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

పెడనలో ఫ్లెక్సీపై రగడ



వైఎస్సార్ సీపీ బ్యానర్‌ను దగ్గరుండి తీయిస్తున్న పోలీసులు

పెడన: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీపై రగడ జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఎన్డీఏ కూటమి స్థానిక నాయకులు, కార్యకర్తలు బస్‌స్టాండ్ వద్దకు చేరుకుని అక్కడ ఉన్న వైఎస్సార్ సీపీ బ్యానర్‌ను తీయించడానికి ఉద్యుక్తులవ్వగా పోలీసులు అడ్డుకున్నారు. మీరు తీయడానికి వీల్లేదని, మున్సిపల్ అధికారులు వచ్చి సిబ్బందితో తీయిస్తారని ఎన్డీఏ కూటమి నేతలకు పోలీసులు నచ్చచెబుతూ వచ్చారు. మున్సిపల్ అధికారులను, సిబ్బందిని పిలిపించి బ్యానర్‌ను తీయించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అధికారం మాది మా బ్యానర్లే ఉండాలంటూ టీడీపీ, జనసేన నేతలు వీరంగం వేశారు. ఇదే సమయంలో వైఎస్సార్ సీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా, స్థానిక నాయకులు రౌతుల ప్రసాద్, కోమట్ల అనిల్, కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్‌లతో పాటు కార్యకర్తలు బ్యానర్ తీయడానికి వీల్లేదని మున్సిపల్ సిబ్బందికి సూచించడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభానీ ఆధ్వర్యంలో పోలీసులు బస్టాండు వద్ద పికెట్ ఏర్పాటుచేశారు.

అధికారులపై మరింత వత్తిడి

అధికార పార్టీ నాయకులు అటు పోలీస్ ఉన్నతాధికారులను, ఇటు మున్సిపల్ అధికారులను తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురిచేయడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి మరీ వైఎస్సార్ సీపీ బ్యానర్‌ను తొలగింపజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులతో డీఎస్పీ అబ్దుల్ సుభానీ పెడన పీఎస్‌లో చర్చలు జరిపారు. పట్టణంలో ఫ్లెక్సీలను తొలగించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ భండారు ఆనందప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఖాజా తదితరులు డీఎస్పీకి సూచించారు. చివరకు అక్కడ ఎవరి బ్యానర్లను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటే అభ్యంతరం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు డీఎస్పీకి స్పష్టం చేయడంతో అలాగే చేద్దామని హామీ ఇచ్చారు. ఎట్టకేలకు కమిషనర్ వెంకటరామయ్య ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ కార్యదర్శి జితేంద్రను, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులతో పోలీసులు వైఎస్సార్ సీపీ బ్యానర్‌ను తీయించి మున్సిపల్ కార్యాలయంలో పెట్టించారు. కూటమి నేతలు కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేయడానికి సిద్ధమవడంతో డీఎస్పీ అబ్దుల్ సుభానీ క్విక్ రియాక్షన్ టీం బందోబస్తును పిలిపించి పరిసర ప్రాంతాలను క్లియర్ చేయించారు. టీడీపీ బ్యానర్ కూడా పెట్టించవద్దని ఆదేశించారు.

భక్తజన సందడి

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాల పొంగళ్ల శాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి సమర్పించారు.

జంధ్యాల పాపయ్య శాస్త్రికి నివాళి



గుడివాడ టౌన్: ప్రముఖ తెలుగుకవి జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి వేడుకలు తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో పాపయ్యశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కవిగా, పండితుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, సంపాదకుడిగా, బాల సాహిత్య పథకుడిగా, ఉపన్యాసకుడిగా, బహువిధ ప్రతిభామూర్తిగా జీవించిన పాపయ్యశాస్త్రి మొత్తం 76 గ్రంథాలు రచించిన ఘనుడని పేర్కొన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయిని పి. వెంకట శైలజకు జంధ్యాల పాపయ్య శాస్త్రి స్ఫూర్తి పురస్కారం–2024 తో సత్కరించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, కవి హెచ్.ఆర్.చంద్రం, ఎం. మాధవరావు, ఎన్.సాంబశివరావు, డి.ఆనంద్ మోహన్‌బోస్, ఆర్‌వీఎల్ నరసింహరావు, వసుధ బసవేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, డీఆర్‌బీ ప్రసాదు, దండమూడి సీతారామస్వామి, సీహెచ్. రూప, ఎస్.పద్మజ పాల్గొన్నారు.